సాక్షి సిద్దిపేట

7

ఆదివారం । 20 । జూలై । 2025

పేదరికం జయించి..
కొలువులు సాధించి



సండే స్పెషల్

వారంతా యువ ఎస్‌ఐలు.. కడుపేదరికం నుంచి వచ్చిన వారే.. కష్టపడి చదివి కొలువులు సాధించారు. తల్లి దండ్రుల కష్టానికి ప్రతిఫలం వీరు.. ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లాలో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా.. వారి కుటుంబ నేపథ్యం.. మనోభావాలు..

- గన్నె తిరుపతి రెడ్డి, దుబ్బాక / రాంచర్ల వేణుగోపాల్ రెడ్డి, దుబ్బాకటౌన్

8లో

న్యూస్‌రీల్

ఉపకరణాల ఎంపికకు హాజరుకండి

సిద్దిపేటరూరల్: ఉపకరణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు ఈనెల 22న మధ్యాహ్నం వారి ధ్రువపత్రాల, భౌతిక పరిశీలనకు హాజరు కావాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 18న హాజరుకాని వారు కూడా హాజరు కావాలని సూచించారు.

సంక్షేమ హాస్టళ్ల దుస్థితి పట్టదా?



ధర్నా చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

హుస్నాబాద్: బీసీ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినా ఎవరికీ పట్టడంలేదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మహత్యా యత్నానికి పాల్పడి 24 గంటలు గడిచినా స్థానిక అధికారులు స్పందించలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల దుస్థితిపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించాలని డిమాండ్ చేశాడు. హాస్టళ్లను అధికారులు పర్యవేక్షించకపోడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు.

అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో అతిథి అధ్యాపకులుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్స్‌లో 2, మైక్రో బయాలజీ 1, ఇంగ్లిష్ 2, ఫిజిక్స్‌లో 1 చొప్పున సబ్జెక్టులను బోధించేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 22లోగా విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలతో దరఖాస్తును కళాశాల లోని కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈనెల 23న ఉదయం 11గంటలకు ఇంటర్వ్యూ, డెమో క్లాసుల ద్వారా ఎంపిక చేస్తారన్నారు.

ఫీల్డు అసిస్టెంట్ల నిరసన



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న ఫీల్డు అసిస్టెంట్లు

హుస్నాబాద్‌రూరల్: మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదంటూ ఉపాధిహామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాలని అధికారులు ఆదేశాలు ఇవ్వడం తప్ప వేతనాలు ఇప్పించడంలో పట్టింపు లేదన్నారు. ఉపాధిహామీ పనుల పై వీక్లి సమావేశాలు నిర్వహించి పనులు అప్పగించే అధికారులు వేతనాల విషయంలో ఎందుకు జోక్యం చేసుకోవడంలేదని అన్నారు. కూలీల చేత పనులు చేయిస్తున్నా మా సమస్యలను ఎందుకు పరిష్కారించడం లేదన్నారు. ఈ సందర్భంగా వినతి పత్రాన్ని ఎంపీడీఓకు అందించి వీక్లీ సమావేశాన్ని బహిష్కరించారు.

వైద్య సేవల్లో ఆదర్శంగా నిలవాలి

సిద్దిపేటకమాన్: వైద్యాధికారులు, సిబ్బంది అందరూ సమష్టిగా కృషి చేసి వైద్య సేవల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని నూతన ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధనరాజ్ తెలిపారు. బాధ్యతలు చేపట్టిన ధనరాజ్‌ను వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో శనివారం పలువురు వైద్యులు, సిబ్బంది అతడిని అభినందించారు. ఈ సందర్భంగా ధనరాజ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించకూడదని, సమయ పాలన పాటించాలని సూచించారు.



హుస్నాబాద్‌లో జరిగిన సంబురాల్లో మహిళలు

గోరింట సంబురం



హుస్నాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం మహిళలు గోరింటాకు సంబురాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల, తల్లి మల్లవ్వతో పాటు కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం సంప్రదాయంగా వస్తోంది. గోరింటాకు పెట్టుకుంటే వేడి తగ్గించడమే కాకుండా, చర్మ వాధులు దూరమవుతాయని నమ్మకం. కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసీ సంతోషి, మాజీ కౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజిని, దండి లక్ష్మి, మెప్మా ఆర్పీలు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు. అలాగే గజ్వేల్ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలోనూ గోరింటాకు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. - హుస్నాబాద్

గజ్వేల్‌రూరల్: గోరింటాకు ఉత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

మిత్తిమీరుతుండ్రు

జోరుగా ఫైనాన్స్‌ల దందా?

ప్రైవేటు వడ్డీ వ్యాపారులు విజృంభిస్తున్నారు. విచ్చలవిడిగా దందాను కొనసాగిస్తూ.. అధిక వడ్డీ వసూలు చేస్తూ పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. వడ్డీలకు చక్రవడ్డీలు విధిస్తూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. దీంతో వారు ఎవరికీ చెప్పుకోలేక లోలోపలే విలవిల్లాడుతున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఫైనాన్స్ దందాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. - సాక్షి, సిద్దిపేట



చిన్నకోడూరు మండలం మాచాపూర్‌లో ఓ ఇంటి ఎదుట ప్రైవేట్ ఫైనాన్స్ సిబ్బంది బెదిరింపులు (ఫైల్)

- నిరుపేదలే లక్ష్యంగా వ్యాపారం
- ఇష్టారాజ్యంగా అధిక వడ్డీ వసూలు
- బెదిరింపులు.. దౌర్జన్యాలు
- ఆస్తులు స్వాధీనం చేసుకుంటామంటూ నోటీసులు
- విలవిల్లాడుతున్న సామాన్య ప్రజలు

జిల్లాలో దాదాపుగా 100కి పైగా ఫైనాన్స్ సంస్థలు నిర్వహిస్తున్నారు. ఇందులో సగం వరకు అనధికారికంగా వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో బ్రోకర్లను నియమించుకుని అడ్డూఅదుపు లేకుండా వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. పలు ఫైనాన్స్ కంపెనీలు నిబంధనలను అతిక్రమించి అధిక వడ్డీలకు అప్పుగా ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకొని జలగల్లా పట్టి పీడిస్తున్నారు. వీరి బారిన పడిన వారు ఆర్థికంగా కోలుకోనిస్థితికి వెళ్తున్నారు.

అనేక సంతకాలు

జిల్లాలో పలు ఫైనాన్స్ సంస్థలు అధికంగా మార్టిగేజ్ చేసుకుని రుణాలు ఇస్తున్నాయని సమాచారం. రుణాలు తీసుకునే సమయంలో తక్కువ వడ్డీ అని చెప్పి తర్వాత అనేక సాకులు చూపుతూ అధిక మొత్తంలో వడ్డీ వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. మార్టిగేజ్ చేసుకోవడమేకాకుండా ఆయా సంస్థలు దాదాపు 50కిపైగా సంతకాలు పెట్టించుకుంటున్నారు. నిరక్షరాస్యులు చదవలేరు. అలాగే పలువురికి ఇంగ్లిష్ చదవడం రాదు దీంతో ఏమి చదవకుండానే వేలిముద్రలు వేస్తున్నారు. దీంతో వినియోదారులకు అర్థం కాని రీతిలో గోప్యంగా కూడా అధిక వడ్డీలు, ఇతర చార్జీలు దండుకుంటున్నారు. రుణం తీసుకున్న వారి దగ్గరికి పలు సంస్థలు చెల్లించే చివరి రోజు వచ్చి డబ్బులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. రెండు రోజులు ఆలస్యంగా చెల్లిస్తుండటంతో తెలియకుండానే జరిమానాలు సైతం వసూలు చేస్తున్నాయి. వాటికి చక్ర వడ్డీలు విధిస్తున్నారు.

పలువురికి నోటీసులు

ఆర్థిక ఇబ్బందులతో డబ్బులు చెల్లించలేని వారికి పలు ఫైనాన్స్ సంస్థలు నోటీసులు జారీ చేస్తున్నాయి. ఇంటిని జప్తు చేసుకుంటామని బెదిరింపులకు గురి చేయడంతో రైతులు, సాధారణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇంటి వద్దకు ఫైనాన్స్ సంస్థల ఉద్యోగులు వచ్చిన గొడవలు చేసిన సంఘటనలున్నాయి. అప్పు ఇచ్చే సమయంలో ఒక బ్యాచ్.. వసూలు చేసేందుకు మరో బ్యాచ్‌లను ఫైనాన్స్‌లు ఏర్పాటు చేసుకుంటున్నాయి. దీంతో ఏమి చేయలేక పలువురు భూములు అమ్మి ఫైనాన్స్ సంస్థలకు అప్పులు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వారి ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వేధింపులు తట్టుకోలేకపోతున్నాం

నా స్థలాన్ని తాకట్టు పెట్టి ఇల్లు కట్టుకునేందుకు రెండేళ్ల క్రితం ఫైనాన్స్ సంస్థలో రూ.6లక్షలు అప్పుతీసుకున్నాను. నెలకు రూ.17వేల చొప్పున కిస్తులు చెల్లిస్తున్నాను. ఆర్థిక ఇబ్బందులతో రెండు వాయిదాలు చెల్లించకపోవడంతో ఫోన్‌లు చేసి బెదిరింపులకు గురి చేస్తున్నారు. నేను ఫోన్ లిఫ్ట్ చేయకపోతే నా ఫ్యామిలీ వారికి, ఫ్రెండ్స్‌కు ఫోన్‌లు చేసి వేధిస్తున్నారు. ఇంటికి వచ్చి బెదిరించడమేకాకుండా దుర్భాషలాడుతున్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.


- కొమురవెల్లి యాదగిరి, తిమ్మాయిపల్లి, నంగనూరు

తీసుకున్న అప్పునకు రెండింతలు

అత్యవసర పరిస్థితుల్లో సిద్దిపేటలోని ఓ ఫైనాన్స్ సంస్థలో తీసుకున్న అప్పుకు రెండింతలు డబ్బు వసూలు చేస్తున్నారు. రెండేళ్ల కిందట రూ.9లక్షలు అప్పుగా తీసుకున్నాను. నెలకు రూ.22వేల చొప్పున చెల్లిస్తున్నాను. ఒక్కరోజు ఆలస్యం అయినా ఫోన్లు చేస్తున్నారు. ఇంటికి వచ్చి బెదిరింపులకు గురిచేస్తున్నారు.

- బాధితుడు, తిమ్మాయిపల్లి

చర్యలు తీసుకుంటాం



అప్పు తీసుకున్న వారిని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు వేధింపులకు గురి చేస్తుంటే మా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం వడ్డీ వసూలు చేయాలి. అధిక వడ్డీ వసూలు చేస్తే చర్యలు తప్పవు. రిజిస్టర్ లేని ఫైనాన్స్ సంస్థలు కొనిసాగిస్తే కేసులు నమోదు చేస్తాం.

- డాక్టర్ అనూరాధ, సీపీ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ హైమావతి
- కలెక్టర్ ప్రాంగణంలో వన మహోత్సవం



కలెక్టరేట్ ప్రాంగణంలో మొక్క నాటుతున్న కలెక్టర్

సిద్దిపేటరూరల్: 'పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత.. ప్రతి ఒక్కరూ బాధ్యతతో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలి' అని కలెక్టర్ హైమావతి అన్నారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొని మొక్కలు నాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, డీపీఓ దేవకీదేవి, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

సిద్దిపేటకమాన్: చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి తెలిపారు. జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో ముందు వరుసలో ఉండే విధంగా న్యాయ, పోలీసు అధికారులు పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, జిల్లా అదనపు న్యాయమూర్తి జయప్రసాద్, జూనియర్ సివిల్ జడ్జి రేవతి, సీపీ అనురాధ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని అరికడదాం

జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి



అనాజీపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ దేవకీదేవి

దుబ్బాకటౌన్: గ్రామాలలో ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. శనివారం రాయపోల్ మండలం అనాజీపూర్, రాయపోల్ గ్రామ పంచాయతీలు, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామం, ప్రధాన రహదారి వెంట ఉన్న మురుగు కాలువలు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న దృష్ట్యా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు పంచాయతీ కార్యదర్శిలను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శుల విధులు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాల య్య, ఎంపీఓ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ముత్తాలీఫ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.



తరగతి గదిలో పండ్లు, పసుపు వర్ణ దుస్తులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కనుల 'పండు'గగా..

తున్కిఖాల్సా స్కూల్‌లో వినూత్నకార్యక్రమం

ఫలాలే పాఠ్యమయ్యాయి. పసుపు వర్ణంతో పాఠశాల అలరారింది. పండ్ల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిసేందుకు తున్కిఖాల్సా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. తరగతి గదులను వివిధ పండ్లతో అలంకరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మిలమిలమెరిసే పసుపు వర్ణ దుస్తులతో హాజరయ్యారు. పండ్ల ప్రాముఖ్యత విద్యార్థులకు వివరించారు. - వర్గల్(గజ్వేల్)

నానో ఎరువులపై ఫోకస్

- యూరియా కొరత నేపథ్యంలో వ్యవసాయ శాఖ నిర్ణయం
- జిల్లా అంతటా అవగాహన సదస్సులు
- సాధారణ ఎరువులతో పోలిస్తే మేలంటున్న అధికారులు

నానో ఎరువులపై వ్యవసాయశాఖ ఫోకస్ పెట్టింది. యూరియా కొరత రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సాధారణ ఎరువులతో పోలిస్తే.. నానో ఎరువులతో మంచి ఫలితాలుంటాయని రైతులకు వివరిస్తూ చైతన్య పరిచే కార్యాచరణతో ముందుకుసాగుతోంది. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా అవగాహన సదస్సులకు శ్రీకారం చుట్టారు.



గజ్వేల్‌లోని ఓ దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నానో యూరియా, డీఏపీల లిక్విడ్ బాటిళ్లు

గజ్వేల్: జిల్లాలో నానాకాలం సీజన్‌కు సంబంధించి సుమారు 5.50లక్షల పైచిలుకు ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వస్తాయి. యాసంగిలో 3లక్షల ఎకరాల వరకు సాగవుతాయి. రైతులు రసాయనిక ఎరువులపైనే ఆధారపడటం వల్ల ఏటా జిల్లాలో ఆయా నియోజకవర్గాలకు ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు యూరియా 35,144 మెట్రిక్ టన్నులు, డీఏపీ 25,524 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 20,419 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 49,474 మెట్రిక్ టన్నులు మొత్తం కలుపుకొని 15,9227 మెట్రిక్ టన్నుల రసాయనిక ఎరువులు అవసరం ఉంటుందని అంచనా. రబీలో మరో 90వేల మెట్రిక్ టన్నులు అవసరమని తెలుస్తోంది.

యూరియా కొరతతో కష్టాలు

ఇతర ఎరువులతో పోలిస్తే ఏటా యూరియా కొరత రైతులకు కష్టాలను తెచ్చిపెడుతోంది. జిల్లాలో వానాకాలం సీజన్ మొత్తానికి 35,144మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. కానీ ఇప్పటి వరకు కేవలం 9,700 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని చోట్ల కొరత తలెత్తింది. పలు మండల కేంద్రాల్లో రైతులు బారులు తీరుతున్న సంఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే వ్యవసాయశాఖ నానో ఎరువులపై దృష్టి పెట్టింది.

పర్యావరణహితం..

కేంద్ర ప్రభుత్వం సంస్థ ఇఫ్కో ఉత్పత్తి చేస్తున్న ద్రవ రూప నానో యూరియా, డీఏపీలు సాధారణ ఎరువులతో పోలిస్తే పర్యావరణహితంగా పనిచేస్తాయని వ్యవసాయశాఖ చెబుతోంది. రసాయనిక యూరియా బస్తా ఎమ్మార్పీ రూ.266ఉండగా, నానో యూరియా లిక్విడ్ అర లీటర్ బాటిల్ రూ.225లకే లభిస్తోంది. అర లీటర్ లిక్విడ్ బాటిల్ ఎకరా మొత్తానికి పిచికారీ చేయడానికి సరిపోతుంది. కానీ బస్తాల రూపంలో రైతులు ఎకరాకు 3నుంచి 4బస్తాలను వాడతారు. ఇలా ఒక పంటకు రెండుసార్లు వేస్తారు. అంటే 6నుంచి 8బస్తాలను ఉపయోగిస్తారు. నానో యూరియా మాత్రం రెండుసార్లు పిచికారీ చేయాలనుకుంటే రెండు అర లీటర్ల బాటిళ్లు సరిపోతాయి. అదేవిధంగా డీఏపీ సాధారణ బస్తా ఎమ్మార్పీ రూ.1130ఉండగా నానో డీఏపీ లిక్విడ్ ఎమ్మార్పీ రూ.550మాత్రమే. ఎకరాకు సాధారణంగా బస్తాల్లోని డీఏపీ మూడుసార్లు మూడుకుపైగా బస్తాలు వాడతారు. కానీ నానో లిక్విడ్ డీఏపీ రెండు బాటిళ్లు కొనుగోలు చేస్తే ఎకరాకు సరిపోతుంది. రైతులకు ఖర్చు తగ్గడమేకాకుండా, మంచి ఫలితాలను ఇవ్వనుంది.

రసాయనిక ఎరువులతో అనర్థమే

రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వాడటం వల్ల నేల సారం తగ్గి పంటల సాగులో దిగుబడులు పడిపోతుంటాయిం. పైగా రైతులు నష్టాల బారిన పడటం సహజపరిణామంగా మారుతోంది. పంటల ఉత్పత్తుల్లో పోషకాలు లోపించి, కలుషితమవుతున్నాయి. ఈ పరిణామం ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారుతోంది. నానో ఎరువుల వాడకం వల్ల నేల ఆరోగ్యాన్ని మెరుగుపరిచి ఉత్పాదకతను పెంచనుంది. అంతేకాకుండా తెగుళ్లను తట్టుకునే శక్తిని పెంపొందిస్తోంది. ఈ అంశాలను రైతులకు వివరించి వారిని చైతన్యపరడానికి వ్యవసాయశాఖ కృషి చేస్తోంది. ఈ క్రమంలోనే జిల్లావ్యాప్తంగా ఫర్టిలైజర్స్ డీలర్లు, రైతులతో అవగాహన సదస్సులను నిర్వహిస్తోంది.

మంచి ఫలితాలు వస్తాయి

నానో ఎరువుల వాడకంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ విషయాన్ని రైతులకు వివరిస్తూ పంటల సాగులో వాడేలా ప్రోత్సహిస్తున్నాం. ఇందుకోసం అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. వీటి వాడకం మేలు అని కూడా చెబుతున్నాం. జిల్లాలో రసాయనిక ఎరువుల కొరత లేదు.

- స్వరూపరాణి, జిల్లా వ్యవసాయాధికారి

ముంచెత్తిన వరద

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/హుస్నాబాద్: జిల్లా వ్యాప్తంగా శనివారం వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. హుస్నాబాద్‌లో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పలు ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు జాగారం చేశారు. దీనికి తోడు కరెంట్ నిలిచిపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. మరోవైపు మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టణంలో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. రహదారులు, మురికి కాలువలను పరిశీలించారు. జిల్లాలో సగటున 40మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. అత్యధికంగా నంగునూరు మండలంలో 99.5మి.మీ., ధూళ్మిట్టలో 91మి.మీ., హుస్నాబాద్‌లో 83.7మి.మీ., నారాయణరావుపేటలో 74.6మి.మీ., కొమురవెల్లిలో 72.1మి.మీ., కోహెడలో 70మి.మీ., సిద్దిపేటలో 51మి.మీ. వర్షపాతం నమోదు అయ్యింది.



జిల్లా కేంద్రంలో రహదారిపై వర్షం నీరు



హుస్నాబాద్‌లో పర్యటిస్తున్న మంత్రి పొన్నం



హుస్నాబాద్‌లో ఓ ఇంటిలోకి వరద..

క్లుప్తంగా

విద్యార్థినికి గోల్డ్ మెడల్



దీఈఓ రాధాకిషన్‌తో లిఖిత, పీడీ శ్రీనివాసరావు

వెల్దుర్తి(తూప్రాన్): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని సదాల లిఖిత జిల్లాస్థాయి పరుగు పందెంలో బంగారు పతకం సాధించిందని హెచ్ఎం సాంబయ్య తెలిపారు. మెదక్ ఇందిరాగాంధీ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన 60 మీటర్ల పరుగులో ఆమె జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా డీఈఓ రాధాకిషన్ శనివారం ఆమెకు బహుమతి అందజేశారు. విద్యార్థిని లిఖితతోపాటు శిక్షణ ఇచ్చిన పీడీ శ్రీనివాసరావును అభినందించారు.

వన్యప్రాణుల వేట.. అరెస్టు

నర్సాపూర్: వన్యప్రాణులు వేటాడిన ఇద్దరిని శనివారం అరెస్టు చేసినట్లు స్థానిక అటవీ శాఖ రేంజ్ అధికారి అరవింద్ పేర్కొన్నారు. వివరాలు ఇలా... నర్సాపూర్ రేంజ్ పరిధిలోని వెంకట్రావ్‌పేట అటవీ ప్రాంతంలో తిమ్మాపూర్‌కు చెందిన రామ్, వెంకట్రావ్‌పేటకు చెందిన రమేష్ వన్యప్రాణులను వేటాడారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. అధికారులను రేంజ్ అధికారి అభినందించారు.

నెమలిని కాపాడిన రైతు

కొముురవెల్లి(సిద్దిపేట): కుక్కల దాడిలో గాయపడిన నెమలిని రైతు కాపాడి అటవీ అధికారులకు అప్పగించారు. ఈ ఘటన మండలంలోని గౌరయపల్లిలో చోటు చేసుకుంది. శనివారం గ్రామానికి చెందిన కొయ్యడ మల్లేశం తన వ్యవసాయ బావి వద్ద కుక్కలు నెమలిని గాయపరచగా నెమలిని కాపాడి అటవీ అధికారులకు సమాచారం అందించడంతో వారు గోపాలమిత్ర సాయిలును పంపించారు. అతడు గాయపడి నెమలికి చికిత్స అందించి ఫారెస్టు అధికారులకు అప్పగించారు. అనంతరం నెమలిని కొండపాక ఆనంద నిలయం సమీపంలోని అడవిలో వదిలిపెట్టినట్లు సెక్షన్ ఆఫీసర్ రమేష్, బీట్ ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు.

చిరుత సంచారం



చిరుత పులి అడుగులను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లి, అల్మాజీపూర్, దౌల్తాబాద్ మండలం గాజులపల్లి, దొమ్మాట గ్రామాల శివారు అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవడంతో శనివారం ఒక్కసారిగా కలకలం రేగింది. దీంతో ఆయా గ్రామాల్లో భయాందోళన నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం సాయంత్రం ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికొస్తున్న క్రమంలో దారి పొడవునా ఏదో గుర్తు తెలియని జంతువు పెద్ద పెద్ద కాలి గుర్తులు కనిపించాయి. దీంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అయితే దుబ్బాక అటవీ శాఖ బీట్ ఆఫీసర్ మధుబాల నేతృత్వంలో జంతువు కాలి గుర్తులను పరిశీలించారు. కాలి గుర్తులను మ్యాప్‌ల ఆధారంగా పరిశీలించడంతో ఏడాదిన్నర వయసు కలిగిన చిరుత పులి కాలి గుర్తులుగా నిర్ధారణకు వచ్చారు. కాగా ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఆదివారం చిరుత పులి కదలికలను పసిగట్టడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పట్టుకునే ప్రయత్నం చేస్తామని వెల్లడించారు.

పేదరికం జయించి.. కొలువులు సాధించి

రెక్కాడితే గాని డొక్కాడని పేద, వ్యవసాయ ,కూలీ కుటుంబాల పిల్లలు వీరూ..అయితేనేం చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించారు. ఓ వైపు తల్లిదండ్రులతో పాటు వ్యవసాయం, కూలి పనులు చేస్తూనే కష్టపడి చదువుకొని ఎస్ఐలుగా జాబ్‌లు సాధించారు. 21 నెలలు వివిధ అంశాలపై శిక్షణ తీసుకుని ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ స్టేషన్లలో బాధ్యతలు తీసుకున్న యువ ఎస్ఐలు, వారి కుటుంబ నేపథ్యం, తల్లిదండ్రుల కష్టం, తదితర అంశాలపై సాక్షి ప్రత్యేక కథనం.

– దుబ్బాక/దుబ్బాకటౌన్:

అంతా వ్యవసాయ, పేద, కూలీ కుటుంబాలే..

- ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎస్ఐలుగా బాధ్యతలు
- కడు దయనీయ కుటుంబాల నుంచి వచ్చిన మహిళా ఎస్ఐలు
- తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలం వీరు
- కష్టపడి చదివి ఎస్ఐ జాబ్‌లు కొట్టారు



వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చా..

మాది కరీంనగర్ జిల్లా చొప్పదండి నాన్న బీరయ్య, అమ్మ భూదవ్వ. వ్యవసాయం చేసుకుంటూ నన్ను చదివించారు. అమ్మానాన్నలు, భర్త మహేష్ నా ఎస్ఐ కల నెరవేరడానికి ఎంతగానో ప్రోత్సహించారు. ప్రస్తుతం కొత్తగా మిరుదొడ్డి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉంది.

– సమత, మిరుదొడ్డి, ఎస్ఐ



కుటుంబంతో అరవింద్ కుమార్

తండ్రి టైలరింగ్.. కొడుకు ఎస్ఐ



తల్లిదండ్రులతో నాగిరెడ్డిపేట ఎస్ఐ భార్గవ్‌గౌడ్

దుబ్బాక పట్టణానికి చెందిన ఐరేని శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీ దంపతుల కుమారుడు భార్గవ్ గౌడ్. నా తండ్రి టైలరింగ్ చేస్తూ కుటంబాన్ని పోషించాడు. గతంలో అస్సాం రైఫిల్‌మెన్‌గా, సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాను. ఆర్మీ అధికారి కావాలని కష్టపడి చదివాను. పోలీస్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎస్ఐ పరీక్షకు సిద్ధమై జాబ్ సాధించి కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట ఎస్ఐగా సేవలందిస్తున్నా. ఇటు ఎస్ఐగా పనిచేస్తూనే నాకు సమయం దొరికినప్పుడు అసిస్టెంట్ కమాండెంట్ ఆర్మీ పరీక్షకు సన్నద్ధమవుతున్నా.

– భార్గవ్, నాగిరెడ్డి పేట ఎస్ఐ

అమ్మ కూరగాయలు విక్రయించి..



కుటుంబంతో బెజ్జంకి ఎస్ఐ బోయిని సౌజన్య

మాది కరీంనగర్ జిల్లా సైదాపూర్. నాన్న గతంలో మృతి చెందాడు. అమ్మ కూరగాయలు విక్రయిస్తూ ముగ్గురు ఆడపిల్లలను చదివించింది. ఇద్దరు అక్కలు ఉద్యోగాలు సాధించారు. నా విద్యాభ్యాసం కరీంనగర్‌లోనే పూర్తి చేశా. నేను కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఎస్ఐ జాబ్ కోసం కష్టపడ్డా. మా అమ్మ కష్టానికి ఈ ఎస్ఐ ఉద్యోగంతో ప్రతిఫలం దక్కింది.

– బోయిని సౌజన్య, బెజ్జంకి ఎస్ఐ

అమ్మ కష్టానికి ప్రతిఫలం



మాది కరీంనగర్ టౌన్. నాన్న మల్లేశం, అమ్మ లీలా. నాన్న ఎనిమిదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కుటుంబ భారం అమ్మపై పడింది. నాకు ఒక తమ్ముడు, అక్క ఉన్నారు. మా ముగ్గురిని అమ్మ చిన్న ఉద్యోగం చేస్తూ చదివించింది. నేను బీటెక్ చదువుతూనే పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యేవాన్ని. బీటెక్ పూర్తి కాగానే పోలీస్ శాఖ నోటిఫికేషన్ రాగానే కష్టపడి చదివి ఉద్యోగం సాధించా.

– ప్రశాంత్, అక్కన్నపేట, ఎస్ఐ

4 ఏళ్ల పాప ఉన్నా.. గురి తప్పలేదు



కుటుంబంతో ఎస్ఐ సుచిత

పెళ్లయితే అమ్మాయిలు ఏం సాధించలేరు, ఇంటికే పరిమితం అంటుంటారు. కానీ భర్త, కుటుంబం ప్రోత్సహిస్తే ఏదైనా సాధించవచ్చు. నాకు 6 సంతవ్సరాల పాప ఉంది. మాది కామారెడ్డి జిల్లా తాడ్వాయి గ్రామం. నాన్న వివేకానందరెడ్డి హోంగార్డ్, అమ్మ శారద టైలరింగ్ చేసేది. భర్త సుమంత్, తమ్ముడు సంతోష్ ప్రోత్సహించారు. నా ట్రైనింగ్ సమయంలో పాపకు నాలుగేళ్లు. నా భర్త పాపను చూసుకునేవాడు. – సుచిత, ఎస్ఐ

కీర్తిని గడించేలా..

కామారెడ్డి జిల్లా బిర్కూర్ గ్రామం మాది. అమ్మ భారతి, నాన్న నాగరాజు వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. నేను వరంగల్‌లో బీటెక్ పూర్తి చేశా. పోలీస్ అవ్వాలన్నది నా కోరిక. దాని కోసం పడిన కష్టం వర్ణనాతీతం. తల్లిదండ్రుల కీర్తిని పెంచేలా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తా.

– కరీన కీర్తిరాజ్, దుబ్బాక, ఎస్ఐ



కుటుంబంతో దుబ్బాక ఎస్ఐ కరీన కీర్తిరాజ్

తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు.. కూతురు ఎస్ఐ



దుబ్బాక మండలం చీకోడ్ గ్రామానికి చెందిన నందిరి రాజయ్య, సత్తవ్వ దంపతుల ఒక్కగానొక్క కుమార్తె జ్యోతి. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ జ్యోతిని చదివించారు. తల్లిదండ్రులకు గౌరవం దక్కేలా..జ్యోతి ఎస్ఐ జాబ్ సాధించి ఔరా అనిపించింది. కాగా దుబ్బాక మండలంలో 2వ మహిళా ఎస్ఐగా జాబ్ సాధించిన ఘనత జ్యోతికే దక్కింది.

– జ్యోతి, ఎస్ఐ

తండాలో తళుక్కుమన్న నరేశ్..



కుటుంబంతో మాలోత్ నరేష్, ఎస్ఐ

తండా ప్రజలు వ్యవసాయానికే పరిమితం ఏం సాధించలేరనేది ఒక్కప్పటి మాట. ఆ మాట మూగపోయేలా అనుకున్న లక్ష్యం కోసం ఎంతో కష్టపడ్డాను. మాది కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఎల్లంపేట గ్రామం . నాన్న లాల్‌బహదూర్, అమ్మ హంసీ. వ్యవసాయం చేసేవారు. నేను ఉన్నత స్థానంలో ఉండాలనేది నా తల్లిదండ్రుల కోరిక. 22ఏళ్లకే ఉద్యోగం సాధించా. ఎస్ఐ జాబ్ వచ్చినప్పుడు వాళ్ల కళ్లలో ఆనందం, మాటల్లో చెప్పలేనిది.

– మాలోత్ నరేష్, ఎస్ఐ

5 ప్రభుత్వ ఉద్యోగాల అరవిందుడు

మాది కామారెడ్డి జిల్లా పిట్లం మండలం పోతారెడ్డి పల్లి స్కూల్ తండా. నాన్న లక్ష్మణ్, అమ్మ, జమునా వ్యవసాయం చేసేవారు. తండాలో పుట్టి పెరిగిన నేను చిన్నప్పటి నుంచి ఎస్ఐ అవ్వాలన్న లక్ష్యంతో చదివాను. నాకు 5 గురు అక్కాచెల్లెల్లు. ఎస్ఐ పరీక్షకు సన్నద్ధమవుతూనే.. 4 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినా పోస్టింగ్ తీసుకోలేదు. కష్టపడితే సాధించలేనిదంటూ.. ఏమి లేదు. ఇదే యువతకు ఇచ్చే సందేశం.

– హలావత్ అరవింద్ కుమార్, ఎస్ఐ



తల్లిదండ్రులతో చిన్నకోడూర్ ఎస్ఐ సైఫ్ అలీ

కానిస్టేబుల్ టూ..ఎస్ఐ

మాది కరీంనగర్ జిల్లా గుంటూర్‌పల్లి. అమ్మ తాహెర బేగం, నాన్న షేక్ అహ్మద్. నాన్న వ్యాపారం చేస్తూ చదివించాడు. నేను 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికై విధులు నిర్వహించా. 2023 ఎస్ఐ నోటిఫికేషన్‌లో కష్టపడి చదివి ఎస్ఐగా ఎంపికయ్యాను. చిన్నకోడూర్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించా.

– సైఫ్ అలీ, చిన్నకోడూర్ ఎస్ఐ




కుటుంబంతో రాయపోల్ ఎస్ఐ మానస

తండ్రి కష్టమే నన్ను ఎస్ఐని చేసింది

మాది కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్. అమ్మానాన్నలు కుంచెం రాజేశ్వరి, కనకయ్య. సోదరి, సోదరుడు ఉన్నారు. తన కష్టం పిల్లలకు రాకూడదని తల్లిదండ్రులు కష్టానికి వెనుకాడకుండా చదివించారు. ఎస్ఐగా ఎంపికయ్యాను అని తెలియగానే నా తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు.

– మానస, రాయపోల్ ఎస్ఐ

తండ్రి కూలీ..



మాది కరీంనగర్. నాన్న వెంకన్న, అమ్మ కనకమ్మ ఇద్దరు కూలీపని చేసేవారు. నేను బీటెక్ పూర్తి చేశాను. నన్ను చదివించేందుకు అమ్మానాన్న రెక్కలు ముక్కలు చేసుకోవడం స్వయంగా చూసిన. నా కుటుంబ నేపథ్యాన్ని సవాల్‌గా తీసుకొని పట్టుబట్టి ఎస్ఐ ఉద్యోగం సాధించాను.

– నవీన్,ఎస్ఐ చేర్యాల

మొదటి ప్రయత్నంలోనే..



మాది కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం సిరి బీబీపేట గ్రామం. నాన్న భీమరి పోచయ్య 2011లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అమ్మ మంజుల వ్యవసాయం చేస్తూ తమ్ముడిని, మా ముగ్గురు అక్కచెల్లెళ్లను పోషించింది. నేను ఇప్పటి వరకు ఎలాంటి పోటీ పరీక్షలు రాయలేదు. మొదటి ప్రయత్నంలోనే ఎస్ఐ ఉద్యోగం సాధించాను. నా ఉద్యోగ ప్రయత్నానికి మేనమామ దేషెట్టి లింగం సపోర్టు చేశాడు.

– సృజన, ఎస్ఐ

ఎస్ఐ ఉద్యోగంపై ఇష్టంతో..



తల్లిదండ్రులతో అరుణ్‌కుమార్

2018లో కానిస్టేబుల్‌కి ఎంపికై నా ఎస్ఐ పోస్టుపై ఇష్టంతో వెళ్లలేదు. తల్లిదండ్రుల కలను సాకారం చేయడానికి ఎస్ఐగా ఎంపికై దౌల్తాబాద్‌లో సేవలు అందిస్తున్నాను. కరీంనగర్ జిల్లా గంగాధర గ్రామానికి చెందిన అరుణ్ కుమార్‌కి నలుగురు అన్నదమ్ములు. నాన్న చంద్రయ్య, అమ్మ కాంతమ్మ వ్యవసాయం చేసేవారు. ఎస్ఐ ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చడంతో సంతోషంగా ఉంది.

– గంగాధర అరుణ్‌కుమార్, దౌల్తాబాద్, ఎస్ఐ

ఆరోగ్యమే మహాభాగ్యం: సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఆరోగ్యమే మహాభాగ్యమని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బందికి ఉచిత మెడికల్ క్యాంపును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... ప్రస్తుతం అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్ర బోస్, ఏసీపీలు రవీందర్‌రెడ్డి, నరసింహులు, సదానందం, రవిందర్, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, శ్రీను పాల్గొన్నారు.

కేసుల్లో శిక్షల శాతం పెంచాలి

కేసుల్లో శిక్షల శాతం పెంచాలని సీపీ అనురాధ తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లతో గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల కేసుల్లో ఇన్వెస్టిగేషన్‌పై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ ప్రాసిక్యూటర్లు, కోర్టు కానిస్టేబుళ్ల సమన్వయంతో విధులు నిర్వహించి కేసుల్లో శిక్షల శాతం పెంచాలన్నారు. నేరస్తులకు శిక్షలు పడే విధంగా సాక్ష్యాలను పొందుపర్చాలని అడిషనల్ పీపీ సత్యనారాయణ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సంతానం కలగడం లేదని..

వర్గల్(గజ్వేల్): సంతానం కలగడం లేదన్న మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని మాలపల్లిలో జరిగింది. బేగంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి ప్రకారం.. గ్రామానికి చెందిన ముల్క సతీష్(45), స్వాతి దంపతులకు పదిహేనేళ్ల క్రితం వివాహమైంది. అనేక ఆస్పత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నా పిల్లలు కాలేదు. ఈ క్రమంలో దీంతో సతీష్ తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఇదే విషయమై ఇంట్లో తరచూ బాధపడేవాడు. శుక్రవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పనుల నుంచి వచ్చిన భార్య స్వాతి భర్త ఉరేసుకుని విగతజీవిగా కనిపించడంతో బోరుమన్నది. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి...

గజ్వేల్‌రూరల్: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కేశబోయిన రాములు(54)కు భార్య పెంటమ్మతోపాటు కొడుకు, నలుగురు కూతుర్లు ఉన్నారు. అందరి వివాహాలు జరిగాయి. 13ఏళ్ల క్రితం పెంటమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో అప్పటి నుంచి మానసిక వేదనకు గురైన రాములు మద్యానికి బానిసయ్యాడు. రెండు నెలల క్రితం అనారోగ్యానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స చేయించారు. తాజాగా శనివారం రాములు అస్వస్థతకు గురికావడంతో స్థానిక వైద్యుడి వద్ద చికిత్స చేయించి, కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో స్లాబ్‌కు ఉన్న ఇనుప కొక్కెంకు లుంగీతో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత్రికేయ వృత్తి.. సామాజిక బాధ్యత

- పాలన యంత్రాంగం, ప్రజలకు మధ్య వారధి
- కలెక్టర్ హైమావతి



శిక్షణ పొందిన జర్నలిస్టులతో అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు

సిద్దిపేటజోన్: జర్నలిజం అనేది వృత్తి కాదని అది ఒక సామాజిక బాధ్యతగా ప్రతి జర్నలిస్ట్ గుర్తించాలని కలెక్టర్ హైమావతి సూచించారు. శనివారం తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో విపంచి ఆడిటోరియంలో రెండు రోజులుగా కొనసాగుతున్న జర్నలిస్టుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులు నైతిక నియమాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి, పాలనా యంత్రాంగానికి మధ్య ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వారధి లాంటిదని అభివర్ణించారు. పాత్రికేయ వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

పాఠకుల అభిరుచులకు అనుగుణంగా

నైతిక నియమావళి–మీడియా, చట్టాలు అనే అంశంపై రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ట్రెండ్ మారిందని, పాఠకుల అభిరుచులకు అనుగుణంగా వార్తలు ఉండాలని పేర్కొన్నారు. సాంకేతికతను సమగ్రంగా తెలుసుకుంటే వార్తల సేకరణ సులభం అవుతుందన్నారు. అంతకుముందు తెలంగాణ జర్నలిజం, గతం, వర్తమానం, భవిష్యత్, మీడియా ధోరణులు అనే అంశంపై సంపాదకులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కొవిడ్ ముందు.. తర్వాత పత్రికల్లో మార్పులు వచ్చాయన్నారు. సోషల్ మీడియా యూట్యూబ్‌లో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. అంతకుముందు సీనియర్ జర్నలిస్ట్ ఉడుముల సుధాకర్ రెడ్డి ఫేక్ న్యూస్, సైబర్ క్రైం, సోషల్ మీడియా అంశంపై మాట్లాడారు. అదేవిధంగా సీనియర్ జర్నలిస్ట్ గోవింద్ రెడ్డి నేర వార్తలు అంశంపై వివరించారు. ఈ సందర్భంగా రెండు రోజులుగా శిక్షణ పొందిన వారికి అకాడమీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఆర్‌పీ జయదేవ్ ఆర్య, జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు రంగాచారి, మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఆరా

అక్కన్నపేట(హుస్నాబాద్): బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకొని స్వయం ఉపాధి పొందుతున్న పలువురు మహిళా సంఘాల సభ్యులను కలిసి నేషనల్ లెవల్ మానిటరింగ్ సభ్యులు ఆరా తీశారు. మండల కేంద్రంతోపాటు పంతులీతండా గ్రామంలో శనివారం కేంద్ర బృందం సభ్యులు జోసెఫ్, వినోద్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన సీసీ రోడ్లు, డంప్‌యార్డులు, పశువుల పాకతో పాటు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామాల్లో అమలవుతున్న దాదాపు 12రకాల పనులను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, ఏపీడీ సతీష్, డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి మండలంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల గ్రామంలో శనివారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై నేషనల్ లేవల్ మానిటరింగ్ అధికారులు సురంజన్‌రెడ్డి, సాధిక్‌అలీ పర్యటించారు. కార్యక్రమంలో ఎంఈడీఓ శ్రీనివాస్, ఏపీఓ పుణ్యదాస్, ఏపీఎం సంగమేశ్వర్, పంచాయతీ కార్యదర్శి మల్లేశం, ఫీల్డ్‌అసిస్టెంట్ అర్జున్, గౌరిరెడ్డి, పద్మయ్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయాధారిత ఉత్పత్తులపై అవగాహన

కౌడిపల్లి(నర్సాపూర్): కేవీకేలో శిక్షణ పొందుతున్న ఎస్సీ మహిళా రైతులను శాస్త్రవేత్తలు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని పీజేటీఎస్ఏయూ (ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యునివర్సిటీ) క్షేత్రపర్యటనకు తీసుకువెళ్లారు. తునికి కేవీకేలో ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా రైతులను శనివారం కేవీకే హెడ్‌అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్ ఆధ్వర్యంలో గృహవిజ్ఞాన శాస్త్రవేత్త భార్గవి యూనివర్సిటీకి తీసుకెళ్లి సెంటర్ ఫర్ ఉమెన్ ఇన్ అగ్రికల్చర్‌ను సందర్శించి యంత్రాలు, ప్రాసెసింగ్ యూనిట్స్‌పై అవగాహన కల్పించారు.